## ఎంఫార్మసీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈనెల 14వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 14లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

## బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ) (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ) కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, నాలుగు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 26వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

# ఆందోళన వద్దు..

● చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ భరోసా

ట్రాఫిక్ పోలీసులకు సూచనలు చేస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని, చిత్రంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి

అమీర్‌పేట్, నవంబర్ 9: అభివృద్ధి పనుల పేరిట చిరు వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. అమీర్‌పేట్‌లోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి చౌరస్తా మీదుగా హనుమాన్, కనక దుర్గమ్మ ఆలయాల వరకు వందలాది మంది చిరు వ్యాపారులు దశాబ్దాలుగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అటువంటి వారి ఉపాధిని దెబ్బతీసేలా అభివృద్ధి పనుల పేరుతో అధికారులు పనులు చేపట్టవద్దన్నారు. ఫుట్‌పాత్ నిర్మాణాలతో తమ ఉపాధి ప్రమాదంలో పడిందంటూ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, స్థానిక మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి చిరు వ్యాపారులు ఎమ్మెల్యే తలసానిని కలిశారు. తమను ఆదుకోవాలనే విజ్ఞప్తి మేరకు శనివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పర్యటించి వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్న వీరిని, తగిన ప్రత్యామ్నాయం చూపకుండా తరలించడం సరికాదన్నారు. ఫుట్‌పాత్ నిర్మాణాలు వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మించాలని అధికారులకు సూచించారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, జీహెచ్ఎంసీ ఈఈ వెంకటరమణ, జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణ, ఎస్ఆర్‌నగర్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐలు కాంతారావు, రాంబాబులతో పాటు మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గుర్మిత్ సింగ్, ఉత్తమ్‌కుమార్ రాజ్‌పురోహిత్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హనుమంతరావు, సంతోష్ మణికుమార్, అశోక్‌యాదవ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, వడ్డె కరుణాకర్‌రెడ్డి, కూతురు నర్సింహ, పియూష్‌గుప్తా, గుడిగి శ్రీనివాస్ యాదవ్ , సుమిత్‌సింగ్ తదితరులున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

పనులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 9: అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రధాన దారిలో కొనసాగుతున్న కచ్చా నాలా మోరీ నూతన పైప్‌లైన్ పనులు శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ ఏఈ, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వేగవంతగా పూర్తి చేయాలని అన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్, ఎస్టీ ప్రేమ్, కుమార్, సంతోష్, వంశీ, సుధాకర్, పాండు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేకు సహకరించండి

కంటోన్మెంట్, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కోరారు. శనివారం ఎన్యుమరేటర్లు ప్రతాప్ నివాసంలో సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వే అధికారులు అడిగిన వివరాలను తెలపాలన్నారు. సర్వేలో తమ కుటుంబ సభ్యుల వివరాలు తెలిపామని చెప్పారు. కార్యక్రమంలో ధఫేదార్ విజయ్, ఎన్యుమరేటర్లు పుష్పలత, అనూష పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవం ప్రారంభం

కోటి దీపోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, నవంబర్ 9: కార్తికమాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవ మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈనెల 25 వరకు మహోత్సవం జరుగుతుంది. ప్రతిరోజు 5.30 గంటలకు ప్రారంభం అవుతుంది. శనివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి హాజరైన పూజలు చేశారు. ముక్తేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తుని తపోవనం ఫీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, నంబూరు వనాశ్రమాధిపతి చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ పాల్గొన్ని పూజలు చేశారు.

కోటి దీపోత్సవ కార్యక్రమానికి భారీగా హాజరైన భక్తులు

## హరీశ్‌రావును కలిసిన శ్యామ్‌కుమార్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన శ్యామ్‌కుమార్, చిత్రంలో ఎర్రోళ్ల, తదితరులు

బొల్లారం, నవంబర్ 9: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కంటోన్మెంట్ బోర్డు ఏడో వార్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ శనివారం హరీశ్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రుక్మయ్య, యశ్వంత్‌కుమార్, రాజి రెడ్డి, ఉమేశ్, వేణుగోపాల్, సంతోష్‌గౌడ్, ప్రశాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత సంస్కారం నేర్పేదే చదువు

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

చిక్కడపల్లి, నవంబర్ 9: పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు కరిక్యులం యాక్టివిటీస్ అవసరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండడ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ చదువు అంటే మానవ సంబంధాలను, సభ్యతను, ధైర్యాన్ని ఇచ్చేది అని అన్నారు. కార్పొరేటర్ విద్య వచ్చిన తార్వత అవన్నీ కనుమరుగై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ స్కౌట్స్ గైడ్స్ వేలాది మందిని సంస్కార వంతులుగా తీర్చిదిద్దడంలో గొప్ప ప్రయత్నం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ది భారత్ స్కౌట్స్ గైడ్స్ కోశాధికారి రాజ్‌గోపాల్, కార్యదర్శి సీజే అరుణ్‌కుమార్, పరమేశ్వర్, జాన సమ్యూల్, మీడియా ఇన్‌చార్జి సంజీవరావ్ పాల్గొన్నారు.

## ఓయూ ఇంగ్లిష్ విభాగంలో మ్యూజిక్ క్లబ్ ప్రారంభం

మ్యూజిక్ క్లబ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ ఇంగ్లిష్ విభాగంలో మ్యూజిక్ క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్టు విభాగం హెడ్ ప్రొఫెసర్ విజయ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభాగంలో కళలను పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. విద్యార్థుల సమగ్ర అభ్యాసానికి సైతం ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## సర్వే నుంచి టీచర్లను మినహాయించాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయడంతో పాటు పాఠశాలల వేళలను కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు కుదించాలని సరైన నిర్ణయం కాదన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం పడడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అమోమయానికి గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలల 200 పనిదినాలు, 800 బోధనా గంటలుగా నిర్ధారించారని తెలిపారు. సర్వేతో బోధనా గంటలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ హైదరాబాద్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయి వర్సిటీల్లో ఉన్నత విద్యకు అవకాశం

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులు

అమీర్‌పేట్, నవంబర్ 9: ప్రముఖ విదేశీ విద్యా కన్సల్టెన్సీ టెక్సాస్ రివ్యూ అమీర్‌పేట్‌లోని హోటల్ మారీగోల్డ్‌లో వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ శనివారం నిర్వహించారు. 13 దేశాలకు చెందిన 75 విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు ఒకే చోట చేరారు. విదేశాల్లో విద్యావకాశాల కోసం ఎదురు చూస్తున్న భారతీయ విద్యార్థులకు మంచి అవకాశం లభించింది. ప్రపంచ స్థాయి వర్సిటీల్లో ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఏఐ, ఫార్మా, మెడికల్, ఫైనాన్స్ సహా ఇతర విభాగాల్లో తమకు ఆసక్తి ఉన్న ప్రోగ్రామ్‌లను ఎంచుకునేందుకు అవకాశం కలిగింది. ఈ ఫెయిర్ ద్వారా విదేశీ విద్యకు అవసరమైన వనరులు, అనుమతులు, స్కాలర్‌షిప్, వసతి వంటి అంశాలపై ఆయా విశ్వవిద్యాలయాల నిపుణులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందించారు.

## నిత్యావసరాల పంపిణీ

అడ్డగుట్ట, నవంబర్ 9: సామాజిక సేవ కార్యక్రమాల్లో తాము ఎల్లప్పుడు ముందుంటామని డిస్ట్రిక్ గవర్నర్ లయన్ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం తుకారాంగేట్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320బి ఆధ్వర్యంలో 40 మంది పేదలకు ఎమర్జెన్సీ గ్రోసరీస్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అన్నివర్గాలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్ సల్వ సాయిరాం రాజు, శ్రీనివాస్‌రెడ్డి, తపన్ గోష్, వినోద్‌కుమార్, అవంతిరెడ్డి, పురుషోత్తం, బబ్లిత్‌కౌర్, లతా బండారి, మనోజ్‌కుమార్, శ్రీధర్ బాబు, శంకర్, రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బీఆర్ఎస్ నేత బొట్టు శ్రీనివాస్.
– ముషీరాబాద్, నవంబర్ 9:

## బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

బొల్లారం, నవంబర్ 9: బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు ఏడో వార్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి చిన్నకమేళా బస్తీకి వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా కావడంతో బస్తీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం శ్యామ్‌కుమార్ తన సొంత నిధులు వెచ్చించి సమస్యను పరిష్కరించారు.

## 13న ఢిల్లీలో పెన్షనర్ల ధర్నా

చిక్కడపల్లి, నవంబర్ 9: కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం 13న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం చిక్కడపల్లిలోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఇటీవల ప్రధాని, అధికారులకు కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘం నాయకులు సోమయ్య, అరుణ, శివలింగం, వెంకయ్య, జాఫరుల్లా పాల్గొన్నారు.

## విద్యార్థుల ఎదుగుదలకు కృషి

చిక్కడపల్లి, నవంబర్ 9: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల కోసం ప్లేస్‌మెంట్ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తప్పకుండా ఉద్యోగాలు సాధిస్తారని తెలిపారు. ఇలాంటి ఇంటర్వ్యూలు వారికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

## ఆకాశమే హద్దుగా విద్యార్థులు ఎదగాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: న్యాయశాస్త్ర విద్యార్థులు ఆకాశమే హద్దుగా ఎదగాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ సూచించారు. ఇందులో గురువులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని చెప్పారు. ఓయూ పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో 'న్యూ క్రిమినల్ లాస్: యాన్ ఎరా ఆఫ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం'అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. అనంత లా, విశ్వభారతి లా కళాశాలలతో కలిసి ఓయూ లా కళాశాల సదస్సును నిర్వహిస్తోంది. శనివారం సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ నగేశ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నూతన చట్టాల గురించి విద్యార్థులు ముందుగా తెలుసుకొని, లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే భవిష్యత్తులో వారు న్యాయరంగంలో రాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి విద్యావంతుల అవసరం ఎంతో ఉందని అన్నారు. న్యాయ విద్యార్థులు నూతన చట్టాల గురించి తెలుసుకునేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం పలువురు పరిశోధనా పత్రాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ ఎన్.రాంప్రసాద్, డాక్టర్ రాధికాయాదవ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎంవీ చంద్రమతి, కోకన్వీనర్ డాక్టర్ భవాని, కరస్పాండెంట్ రవి అనంత తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవృత్తి చాలా ఉన్నతమైంది

చిక్కడపల్లి: న్యాయ విద్య, న్యాయవృత్తి చాలా ఉన్నతమైందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. చిక్కడపల్లిలోని పెండేంకంటి న్యాయ కళాశాలలో శనివారం జాతీయ మూట్ కోర్టు పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల న్యాయవృత్తి, న్యాయ విద్యలో పరివర్తన వచ్చిందన్నారు. ఓయూ న్యాయ విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఎన్.రాంప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన న్యాయవృత్తిలో కొనసాగితే ఖ్యాతిగాంచవచ్చని తెలిపారు. సమావేశంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, వాసవి విద్యా సంస్థల అధిపతి పి.రామ్మోహన్‌రావు, కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎం.ఆనంద్, పెండేకంటి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదును సద్వినియోగం చేసుకోవాలి

బోయిగూడలో ఓటరు నమోదు దరఖాస్తులను అందజేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 9: జీహెచ్ఎంసీ ద్వారా అన్ని పోలింగ్ బూత్‌లలో ఆదివారం నూతన ఓటరు నమోదు శిబిరాలు అందుబాటులో ఉంటాయని, 18 ఏండ్ల యువత నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు అన్నారు. శనివారం బోయిగూడలోని గొల్లకొమరయ్యకాలనీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. చిరునామా మార్పు, ఇతర సవరణలకు మరోసారి అవకాశం కల్పించారని ఆయన తెలిపారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సత్యనారాయణ, సాదిక్, రాజేశ్వర్, మమత పాల్గొన్నారు.

### నేడు ఓటరు జాబితా స్పెషల్ డ్రైవ్

సికింద్రాబాద్: ఓటరు జాబితా స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు కార్యాలయ అధికారులు శనివారం తెలిపారు. నేడు నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారి అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటరు జాబితాలో తమ పేర్లను చెక్ చేసుకోగలరని పేర్కొన్నారు. ఒక వేళ లేకపోతే ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోటోతో అందుబాటులో ఉన్న బూత్‌లెవెల్ అధికారికి ఇచ్చి నమోదు చేసుకోగలరని కోరారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

చిక్కడపల్లి, నవంబర్ 9: కోల్‌కతా జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రజా సంఘాల కార్యాచరణ నాయకుల డిమండ్ చేశారు. సీబీఐ సత్వరమే కేసు విచారణను పూర్తిచేసి దోషులను నిర్ధారించాలని శనివారం ఇందిపార్క్‌లోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. పీఓడబ్ల్యూ జాతీయ కార్యదర్శి సంధ్య, సీఎంఎస్ ప్రతినిధులు జయ, సత్య, జ్యోతి, అనసూయ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు మల్లు లక్ష్మి హాజరై మాట్లాడారు. జూనియర్ డాక్టర్ అభయ దారుణంగా హత్యకు గురై నేటికీ మూడు నెలల గడిచిపోయాయని అన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం దోషులను గుర్తించడంలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. సాక్షాలను రూపుమాపి, నిందితులను కాపాడటంలో పోలీసులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరస్పరం సహకరించుకుంటున్నాయని మండిపడ్డారు. లైంగిక నేరాలకు పాల్పడిన నేరస్తులను త్వరితగతిన కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో విజయలక్ష్మి, డాక్టర్ సమీరా, డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాగారాజు, అశోక్‌రెడ్డి, ప్రదీప్, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సికింద్రాబాద్, నవంబర్ 9: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ ఎస్అర్ ఆసుపత్రి వెనుక లైన్‌లో జరుగుతున్న సీసీ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కౌశిక్, వాటర్ వర్క్స్ మేనేజర్ నవ్య పాల్గొన్నారు. నామాలగుండు ఉప్పరబస్తీలో సమగ్ర కుటుంబ సర్వే సరళిని కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో యూసీడీ, సీఓ ధనుశ్రీ, ఆర్పీ నాగజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు విజయలక్ష్మి, రేవతి, గగన తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ హాల్ సమస్యలను పరిష్కరించాలి

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. శనివారం ఆమె ఫంక్షన్‌హాల్‌ను సందర్శించారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదని, కిటికిల అద్దాలు పగిలిపోయాయని, టాయిలెట్లు అధ్వాన్నంగా మారాయన్నారు. హాల్ పరిసరాల్లో పారిశుధ్యం లోపించిందన్నారు. సమస్యను ఎమ్మెల్యే తలసాని దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. నాయకులు కె.లక్ష్మిపతి, జావేద్, నాగభూషణం, కుశాల్, విజయ్‌పాల్, రమేశ్, రాజేంద్రప్రసాద్, కల్యాణ్‌రాం, పురుశోత్తం, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎమ్మెస్సీ డేటా సైన్స్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పా రు.

## బీఏ ఐదో సెమిస్టర్ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 9: ఓయూ పరిధిలోని బీఏ ఐదో సెమిస్టర్ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ పరీక్షలను ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదేరోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచ